క్లుప్తంగా

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై అవగాహన



కొత్తతండాలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి: మండలంలోని కొత్తతండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని కొత్తతండా గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడంతో.. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 16మందిని అర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి స్థల పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన



పోలింగ్ స్టేషన్‌లో అధికారులు

బోనకల్: మండలకేంద్రంలోని బోనకల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్‌ను సోమవారం తహసీల్దార్ పున్నం చందర్, మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. వసతులను పరిశీలన చేశారు.

మోతాదుకు మించి వాడొద్దు..



పంటను పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: రైతులు వరి పొలంలో మోతాదుకు మించి యూరియా వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని శివారు వెంకటాపురంలో వరి పొలాల్లో ఎరువులు వేయడాన్ని పరిశీలించారు. అధికంగా ఎరువుల వాడకం వల్ల చీడపీడల వృద్ధి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం చలి వేడి వాతావరణం ఉండటం వల్ల పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులు ఎరువులు, యూరియా వాడకాన్ని తగ్గించి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ముదిగొండలో లింగమంతుని జాతర



బోనాలతో బయలుదేరిన భక్తులు

ముదిగొండ: ముదిగొండలో లింగమంతుల జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా పారిశ్రామిక ప్రాంతంలోని లింగమంతుని దేవాలయానికి డప్పువాయిద్యాలతో చేరుకుని మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లకు ప్రభలు కట్టి లింగమంతుని దేవాలయానికి చేరుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లింగమంతుని జాతర వద్ద ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొనుగోలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో రెండు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈనెల 10వ తేదీన రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో నుంచి 50 కేజీల కాపర్ వైర్‌ను దొంగిలించినట్లు గుర్తించారు. ఈమేరకు ఏఈ చావా శ్రీధర్ ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సింగరేణి బైపాస్‌రోడ్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కిష్టారం గ్రామానికి చెందిన పాలకుర్తి శ్రీనివాసరావు ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో రోడ్డుపై తీవ్ర గాయాలతో ఉన్న శ్రీనివాస్‌రావును రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పెనుబల్లి నుంచి సత్తుపల్లివైపు వస్తూ గమనించారు. వెంటనే 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంకు తరలించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

రోడ్డు సిగ్నళ్లు లేక డివైడర్లు ఎక్కుతున్న వాహనాలు

- తరచుగా ప్రమాదాలు
- పట్టించుకోని హైవే అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



కల్లూరు హిమాలయ రెస్టారెంట్ వద్ద మొదలైన డివైడర్



రోడ్డుకు ఆనుకుని ఉన్న చిరు వ్యాపారులు

కల్లూరు: హైవే అథారిటీస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల హైవే రోడ్ పై డివైడర్ల వద్ద సరైన సిగ్నళ్లు ఏర్పాటు చేయక పోవడం వల్ల వాహనాలు డివైడర్లు ఎక్కి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన డివైడర్లు..

కల్లూరు పట్టణంలో గతంలో డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం డివైడర్లు శిథిలావస్థకు చేరాయి. ప్రమాదాలు జరుగుతూ.. పట్టణంలోని హియాలయ రెస్టారెంట్ దగ్గర నుంచి పాత బస్టాండ్ వరకు సుమారు 2 కిలోమీటర్ల పాటు పలు స్తంభాలు నేలకొరిగాయి. ప్రస్తుతం అటు చివర, ఇటు చివర డివైడర్లు కొట్టుకుపోయి రోడ్డులో కలిసిపోయాయి. వాహన చోదకులు రాత్రి సమయంలో సిగ్నళ్లు లేక పోవడంతో నేరుగా డివైడర్ల పైకి ఎక్కడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే అధికారులు ఇప్పటికైన స్పందించి డివైడర్లకు రెండు వైపులా రేడియం స్టిక్కరింగ్‌తో సిగ్నల్ ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌ను ఆక్రమిస్తున్న చిరు వ్యాపారులు..

పట్టణంలోని చిరు వ్యాపారులైన.. తోపుడు బండ్లు, పండ్ల షాపులు, కూరగాయల షాపుల వారు హైవే రోడ్డు ఫుట్‌పాత్‌ను ఆనుకుని పెడుతుండడంతో వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. చంద్రుపట్ల రోడ్, కప్పలబంధం రోడ్, మెయిన్ రోడ్, మధిర రోడ్, పుల్లయ్యబంజర్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యపై పోలీస్ అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం..



కల్లూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే చిరు వ్యాపారులకు ట్రాఫిక్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఫుట్‌పాత్ వరకు షాపులు పెడితే వారిపైన చర్యలు తీసుకుంటాం. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– దిద్దుపూడి హరిత, ఎస్ఐ, కల్లూరు

సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి..



అధికారులు రోడ్డు ప్రమాదాలు జరుగకుండా డివైడర్ల వద్ద సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. వాహన చోదకులకు వాహనాలు డివైడర్ దగ్గరకు వచ్చేంత వరకు డివైడర్ కనిపించక.. పైకి ఎక్కడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నళ్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

– అరెగెల అనిల్‌కుమార్, కల్లూరు

రాపల్లెలో పశువైద్య శిబిరం



బహుమతులను అందిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు

బోనకల్: మండలంలోని రాపల్లెలో పశుగణాభివృద్ధి సంస్థ వైరా ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేలు జాతి దూడల ప్రదర్శన, ఉచిత నట్టల నివారణ మందును తాగించటం జరిగింది. పాల ఉత్పత్తిదారులకు పాల పోటీలు నిర్వహించి వారికి మినరల్ మిక్చర్, కాల్షియం సీసాలను అందజేశారు. పాల పోటీలు, దూడల ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు బహుమతులను అందించారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ వైరా సూపర్‌వైజర్ మోత్కూరి వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి వెంకటరమణ, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు నాగేంద్రకుమార్, రవికృష్ణ, గ్రామ పశుమిత్ర బంధం త్రివేణి, గోపాలమిత్రలు నాగుల్ మీరా, వాసు, నాగేశ్వరరావు, ప్రవీణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి వెడల్పు తగ్గించాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ప్రొద్దుటూరు గ్రామస్తులు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామం నుంచి బోనకల్ మండలం రావినూతల వరకు నిర్మిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి వెడల్పును తగ్గించాలని ప్రొద్దుటూరు గ్రామస్తులు కోరుతున్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులతో గ్రామంలోని సామాన్య, మధ్యతరగతికి చెందిన సుమారు 139మంది ఇళ్లు పోతున్నాయని తెలిపారు. రోడ్డు నిర్మాణానికై అధికారులు మార్కింగ్ చేసిన 50 అడుగులను.. 30 అడుగులకు తగ్గించాలని.. వారికి పరిహారం ఇవ్వాలని అధికారులను కోరారు. అదే విధంగా ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలతను కూడా కలిసి వినతి అందించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల వినతి..

కల్లూరు: గ్రామాల్లోని పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. సోమవారం ఖమ్మంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి రైతులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సదర్భంగా అదపను కలెక్టర్‌కు, ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భూక్యా శివకుమార్ నాయక్, భూక్యా పంతులు, బానోత్ లాల్‌సింగ్, హనుమా పాల్గొన్నారు.

వారబందీ విధానం ఎత్తివేయాలని..

కొణిజర్ల: ఎన్ఎస్పీ సాగర్ జలాలకు వారబందీ విధానం ఎత్తివేసి నిరంతరాయంగా రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందించారు. సాగర్ ఆయకట్టు కింద రైతులు మొక్కజొన్న, వరి సాగు చేశారని ప్రస్తుతం కంకులు పాలు పోసుకునే దశలో ఉన్నందున నీరు అవసరమని తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలన



వల్లాపురంలో పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


వైరారూరల్: మండలంలోని వల్లాపురం గ్రామంలో ఎన్ఎస్పీ ఆయకట్టు కింద సాగు చేసిన మొక్కజొన్న పంటలను సోమవారం ఏడీఏ తుమ్మపల్లి కరుణశ్రీ , ఏఓ మయాన్ మంజుఖాన్ పరిశీలించారు. ఆ తర్వాత పంట సాగులో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నీరందక మొక్కజొన్న పంటంతా ఎండిపోతుందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ, ఏఈఓ వాసంతి, రైతులు తుమ్మల రాణాప్రతాప్, నల్లమోతు నాగేశ్వరరావు, రాయల లక్ష్మయ్య తదితరులున్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

బోనకల్: పంటలకు సరిపోను నాగార్జునసాగర్ జలాలను విడుదల చేయాలని రైతు సంఘం నాయకుడు చింతలచెర్వు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని జగ్గయ్యపేట – వైరా ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిరసన వ్యక్తం చేయగా.. ఎన్నెస్పీ అధికారులు వచ్చి సాగర్‌జలాలు విడుదల చేస్తామని తెలుపడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, కూచిపూడి మురళి, కోట నాగరాజు, బంధం శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, గుగులోతు నరేష్ తదితరులున్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

వైరా: వైరాలోని క్రాంతి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడక సోమవారం కళాశాలలో విద్యా సంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కరస్పాడెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు, క్రమశిక్షణ, మంచి నడవడిక, నైతిక విలువలతో కూడిన విద్యను అందజేస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడమే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఇంటర్మీడియట్ బాలికలకు బహుమతులు అందించారు.



బాలికలకు బహుమతులు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

అనంతరం బాల బాలికలు ప్రదర్శించిన వివిధ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పీఓ లింగారావు, ప్రిన్సిపల్ కృష్ణారావు, వేణు, నరేంద్ర, నాగలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రికి 25 ప్రత్యేక బస్సులు



డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెనుబల్లి మండలం నీలాద్రికి సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి 25 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 26న తెల్లవారుజామున 3 గంటల నుంచి 27వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. సత్తుపల్లి నుంచి నీలాద్రికి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30 చొప్పున ఛార్జీ ఉంటుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీనిబట్టి బస్సులు పెంచుతామని తెలిపారు.

నాయబ్ తహసీల్దార్‌గా లక్ష్మి



కె.లక్ష్మి

ముదిగొండ: ముదిగొండ డిప్యూటీ తహసీల్దార్‌గా కె.లక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కారేపల్లి మండలం నుంచి బదిలీపై ఆమె ముదిగొండకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఉసికల ఉపేందర్ ఖమ్మంలోని డీఎస్ఓకి బదిలీ చేయడంతో.. ఆయనను తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సింగరేణి డిప్యూటీ తహసీల్దార్‌గా కృష్ణయ్య



కృష్ణయ్య

కారేపల్లి: సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య బదిలీపై సింగరేణి మండలానికి రాగా.. సింగరేణి డీటీగా, కొన్ని నెలలు ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన లక్ష్మి ముదిగొండ మండలానికి బదిలీ అయ్యారు.

గుంతను పూడ్చారు..



గుంతను పూడ్చుతున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లిటౌన్: ఎట్టకేలకు సత్తుపల్లిలోని సురేష్ సైకిల్ షాపు వీధి ఎదురుగా ఉన్న తాగునీటి లీకేజీ మరమ్మతుల కోసం తీసిన గుంతను సోమవారం మున్సిపల్ సిబ్బంది పూడ్చివేశారు. 'గుంత తీశారు.. పూడ్చుట మరిచారు..'అనే శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. కాగా, మున్సిపల్ కమిషనర్ నర్సింహా.. లీకేజీలకు గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు.

శ్రీనివాసరావు మృతికి సంతాపం

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పీఏ శ్రీనివాసరావు మృతికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావులు సోమవారం సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేసి.. శ్రీనివాసరావు సేవలను కొనియాడారు.

చింతకాని: గుండెపోటుతో మృతిచెందిన శ్రీనివాసరావు మృతదేహాన్ని సోమవారం చింతకాని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, గోపి, కిషోర్, నాగార్జున్ తదితరులు ఉన్నారు.

విరాళాల వెల్లువ..

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.58వేలు విరాళం



నగదు అందజేస్తున్న గణపతిరెడ్డి దంపతులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీకి ఏలూరు జిల్లా చట్రాయికి చెందిన పాములపాటి గణపతిరెడ్డి, స్వప్న దంపతులు సోమవారం రూ.58,116లు విరాళం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్..



ఫ్యాన్, కూలింగ్ వాటర్ క్యాన్, చాపలను అందజేస్తున్న అచ్చయ్య

చింతకాని: మండలంలోని పాతర్లపాడు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి.. గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు అచ్చయ్య ఫ్యాన్‌తో పాటు కూలింగ్ వాటర్ క్యాన్, చాపలను సోమవారం వితరణగా అందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవి దృష్ట్యా పిల్లలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు దారెల్లి రమేష్, పంగ గోపయ్య, ఉసికల నారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం

తల్లాడ: తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్‌కు చెందిన నిరుపేద విద్యార్థులకు.. తోటి విద్యార్థి ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా.. ఐదుగురు నిరుపేద మిత్రుల పరిస్థితిని తెలుసుకున్నాడు. దీంతో చలించిన ఆయన సోమవారం రూ.50 వేలు ప్రకటించారు. దీంతో ఎం.సురేష్, డి.వెంకట్‌లాల్.. ఆ నగదును పూర్వ విద్యార్థులు టి.విజయ్‌కుమార్, ఎన్.ప్రభాకర్, డి.బాబురావు, డి.వెంకటేశ్వర్లు, ముత్యాలుకు రూ.10వేలు చొప్పున అందించారు.

ఆలయంలో అన్నదానానికి..



విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. స్థానిక శివాలయం రోడ్డుకు చెందిన తుమ్మలపల్లి పుల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె – అల్లుడు పాగి పార్వతి, బాలస్వామి దంపతుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్ మాట్లాడుతూ.. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అన్నదానం చేసిన పార్వతి, బాలస్వామి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఎల్ఈడీ టీవీ..



అన్నవరం అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ అందిస్తున్న ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సభ్యులు

కొణిజర్ల: మండలంలోని అన్నవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారు రూ.20 వేలు విలువ చేసే ఎల్ఈడీ టీవీని వితరణగా అందించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామన అచ్యుత్ సూచనల మేరకు ఫౌండేషన్ వారు వితరణ చేశారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు బాల యేసు అంగన్‌వాడీలోని 20మంది చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందించగా.. సత్యసాయి ఫౌండేషన్ వారు గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ ఉషారాణి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్పావతి, హెచ్ఎం అచ్యుత్, ఉపాధ్యాయుడు బాలయేసు స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ రాజేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. డిజిటల్ అక్షరాస్యతను అభివృద్ధి చేయటంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రంలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి కంప్యూటర్లను సమకూర్చినట్లు ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు తెలిపారు. నోస్‌ల్యాబ్స్ కంపెనీ ఆధ్వర్యాన రూ.3 లక్షల వ్యయంతో అందించిన బెంచీలు, బోర్డులు, బీరువాలు కూడా ప్రారంభించారు. హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన

కల్లూరురూరల్: మండలంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సదర్భంగా పెద్దకోరుకొండి గ్రామంలో షేక్ జాని కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మర్లపాడులో గార్నెపూడి కృష్ణయ్య, రాజమ్మ మనవరాలు దయావేక్షతను శీర్వదించారు. అదే విధంగా పెద్దకోరుకొండిలో మర్చకట్ల మానేయ దిశదినకర్మలో పాల్గొని మానేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలగవరంలో కష్టాల రాధాకృష్ణమూర్తి దిశదిన కర్మలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు తోటకూర శేషగిరిరావు, ఏనుగు సత్యంబాబు, కొడవటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని గెలిపించండి..



సత్తుపల్లిటౌన్: ప్రచారం చేస్తున్న టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు



బోనకల్: మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ నాయకులు



కొణిజర్ల: మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

సత్తుపల్లిటౌన్/వేంసూరు/తల్లాడ/పెనుబల్లి: ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ ఆధ్యక్షుడు షేక్ రంజాన్, ప్రధాన కార్యదర్శి ఎ.వి.నాగేశ్వరరావు కోరారు. సోమవారం సత్తుపల్లిలోని కార్యాలయాన్ని సందర్శించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అదే విధంగా వేంసూరు, తల్లాడ, పెనుబల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, చెరుకు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు, రవీంద్రనాద్, సూరయ్య, మధు, కొత్తా శ్రీనివాసరావు, నర్సింహారావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పౌరస్పందన జిల్లా అధ్యక్షులు రవి కుమార్, జిల్లా కార్యదర్శులు నిర్మల కుమారి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఎంఈఓ దామోదరప్రసాద్ పాల్గొన్నారు.

బోనకల్/చింతకాని/ఎర్రుపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పారుపల్లి నాగేశ్వరరావు, తేజావత్ వెంగళరావు, కోటిరెడ్డి తెలిపారు. బోనకల్‌లో, చింతకానిలోని నాగులవంచ గ్రామంలో, ఎర్రుపాలెంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లూరి వీరబాబు, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ యాకూబ్ పాషా, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, నాయకులు సద్దా బాబు, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని రెండవసారి తిరిగి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ వీ నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా సంఘాల నాయకులు పర్యటించి అలుగుబెల్లి ని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన జిల్లా అధ్యక్షుడు ఏడునూతల రవికుమార్, యూటీఎఫ్ కొణిజర్ల మండల అధ్యక్షుడు చిలుకూరి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి మాదాల ప్రసాదరావు, నాయకులు షేక్ ఖాదర్, హనుమ, జగ్గయ్య, సైతులు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 81843
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642